క్లుప్తంగా

పెరటికోళ్లు పంపిణీ



పెరటికోళ్లు అందిస్తున్న పశువైద్యాధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండలో బుధవారం 12 మంది లబ్ధిదారులకు సర్పంచ్ జాడి సత్యం చేతుల మీదుగా యూనిట్లను పంపిణీ చేశారు. యూనిట్ అసలు ధర రూ.1,800 కాగా 75 శాతం సబ్సిడీపై రూ.600 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో యూనిట్‌కు 4 వారాలకు 25 కోడి పిల్లలను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు సరిత, శాంతిరేఖ, వీఏ స్వప్న పాల్గొన్నారు.
లక్సెట్టిపేట: మండలంలోని పోతపల్లిలో బుధవారం లబ్ధిదారులకు పెరటికోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్వేత, సిబ్బంది అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాలకు ఇంటర్వ్యూ

కాసిపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మైనార్టీ రుణాలకు సంబంధించి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు సంబంధించి ఒక యూనిట్, దేవాపూర్ యూనియన్ బ్యాంకుకు సంబంధించి ఒక యూనిట్ మంజూరయ్యాయి. 98 దరఖాస్తులురాగా 51 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆలీం, టీజీబీ మేనేజర్ రాజేశ్‌ప్రసాద్, యూనియన్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లికి చెందిన ముత్తె మల్లేశ్‌కు మంజూరైన రూ.19వేలు, మగ్గిడి రాయమల్లుకు రూ.32 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ రజని బుధవారం అందజేశారు. రంగంపల్లికు చెందిన జక్కుల సునీతకు రూ.12వేల చెక్కును మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమాల్లో టీఆర్ఎస్ నాయకులు సత్తయ్య, లచ్చన్న, శంకరయ్య, బాపుచారి, రాజయ్య, రాజేందర్‌గౌడ్, మురళి, కుమార్ పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న పరీక్షకు దరఖాస్తు గడువును ఈనెల 16 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ లలితాకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

క్లరికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: ఆర్కే న్యూటెక్ గనిలో విధులు నిర్వర్తిస్తున్న క్లరికల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు బుధవారం ఆ గని మేనేజర్ స్వామిరాజుకు వినతిపత్రం అందించారు. క్లర్క్‌లు పని చేసే చోట కంప్యూటర్లు సరిగ్గా లేవని, ప్రింటర్లు, స్కానర్లు కూడా సక్రమంగా పని చేయడంలేదని, అవి చెడిపోతే మరమ్మతులకు జాప్యం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ బ్రాంచి నాయకులు భాగ్యరాజ్, కస్తూరి చంద్రశేఖర్, అశోక్ పాల్గొన్నారు.

పూడికతీత పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

వేమనపల్లి: నీల్వాయి, కేతన్‌పల్లి గ్రామ పంచాయతీల్లోని చిన్న నీటికుంట పూడికతీత పనులను బుధవారం ఏపీఓ సత్యప్రసాద్ పరిశీలించారు. ఉపాధి కూలీలు తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. రోజువారీ మస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జాఫర్, ఎఫ్ఏలు తారాబాయి, కిషన్ ఉన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

భీమిని: ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. బుధవారం వీగాం గ్రామంలో పోషకాహార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత, సమతుల్య ఆహారంపై గర్భిణులకు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అంజలిదేవి, పుష్పలత, ఆయాలు పాల్గొన్నారు.

బ్యూటిఫికేషన్ అంటే ఇలాగేనా?

- రూ.10 లక్షలతో సుందరీకరణ
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం



చెత్తతో నిండి ఉన్న బ్యూటిఫికేషన్ ప్రాంతం

బెల్లంపల్లి: 'రాజుల సొమ్ము రాళ్ల పాలు' అన్నచందంగా ఉంది బెల్లంపల్లి మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల తీరు. సరైన చిత్తశుద్ధి లేకుండా మున్సిపాలిటీలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన బ్యూటిఫికేషన్ (సుందరీకరణ) పనులు నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. రోజువారీగా పర్యవేక్షణ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. దూరదృష్టి లేకుండా ఖర్చు చేసిన ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు అయ్యిందని పురప్రజలు పేర్కొంటున్నారు.

రూ.10 లక్షల నిధులు వ్యయం

మున్సిపాలిటీలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద ఆర్మ్‌డ్ రిజర్వుడ్ (ఏఆర్) పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు వెళ్లే రోడ్డును ఆనుకుని కొన్నినెలల క్రితం బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారు. ఇందుకోసం రూ.10 లక్షలు వ్యయం చేశారు. రోడ్డుపక్కన ఉన్న ఖాళీ స్థలంలో కూర్చుని సేదతీరేందుకు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతమంతా అందంగా తీర్చిదిద్ది ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. సిమెంట్ బెంచీలపై కూర్చుని అటు పోచమ్మ చెరువు అందాలు తిలకించడానికి, ఇటు రోడ్డు మార్గం మీదుగా రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులను పరిశీలించేందుకు వీలుగా బెంచీలను ప్రతిష్ఠించారు. చెత్తాచెదారం, చిత్తడి లేకుండా చేశారు. ప్రతీరోజు వాకింగ్‌కు వచ్చే వాకర్స్ కోసం, తీరిక వేళల్లో ప్రకృతిని ఆస్వాదించడానికి వచ్చే పురప్రజల కోసం ఏర్పాటు చేసిన బ్యూటిఫికేషన్ పనులు పర్యవేక్షణ లేక కళ తప్పి దర్శనమిస్తున్నాయి. చెత్తా చెదారంతో నిండిపోయి అలంకార ప్రాయంగా మారింది. ఏ ఉద్దేశంతో బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారో ప్రస్తుతం అందుకు విరుద్ధమైన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఆకతాయిలకు అడ్డాగా...

పోచమ్మ చెరువు ప్రాంతాన్ని ఇప్పటి వరకు పురప్రజలు ఆటవిడుపుకు అనుకూలంగా వినియోగించుకున్నారు. ఇన్నాళ్లుగా చెట్ల కింద సేద తీరేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతాన్ని మందుబాబులు అనుకూలంగా మార్చుకున్నారు. మధ్యాహ్నం నుంచి చీకటి పడేవరకు అక్కడే బెంచీలపై కూర్చుని ఎంచక్కా మద్యం సేవిస్తున్నారు. కొంతమంది యువకులు ఏకంగా గంజాయి కూడా సేవిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడి మినీ ట్యాంక్‌బండ్ ప్రాంతంపై దృష్టి సారించాలని పురప్రజలు కోరుతున్నారు.

కమిషనర్ దృష్టికి తీసుకెళ్తా

పురప్రజలకు ఆహ్లాద కరమైన వాతావరణం కల్పించేందుకు మినీ ట్యాంక్‌బండ్ వద్ద రూ.10 లక్షలతో బ్యూటిఫికేషన్ చేయించాం. ఆ ప్రాంతాన్ని సుందరీకరణ చేయడం వల్ల రోజువారీగా అనేకమంది అక్కడ సేద తీరుతున్నారు. అయితే బజారు ఏరియా ప్రాంతానికి దూరంగా ఉండటంతో చెత్త సేకరణ పనులు సరిగా నిర్వహించలేకపోతున్నాం. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తా.
– సందీప్, ఏఈ, బెల్లంపల్లి మున్సిపాలిటీ

ఆదర్శ వివాహాలతో కులనిర్మూలన

- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జాతీయ నాయకుడు వేములపల్లి వెంకట్రామయ్య



మాట్లాడుతున్న వేములపల్లి వెంకట్రామయ్య

పాతమంచిర్యాల: ఆదర్శ వివాహాలతోనే కుల నిర్మూలనకు నాంది అని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జాతీయ నాయకుడు వేములపల్లి వెంకట్రామయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జాఫర్ నగర్‌లో ఆదర్శ వివాహం చేసుకున్న శ్రీకాంత్, వైష్ణవిలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ వివాహాలు నేడు హోదాకు మారుపేరుగా మారిపోయాయన్నారు. పెళ్లికి ఎంత ఎక్కువ ఖర్చు చేస్తే అంత గొప్ప వారుగా చెలామణి అయ్యే తప్పుడు సంప్రదాయం కొనసాగుతోందన్నారు. దీంతో సమాజంలోని పేద, బలహీన వర్గాల ప్రజలు తమ పిల్లలకు పెళ్లి చేయడం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. వరకట్నం ఒక దురాచారంగా నేటికి కొనసాగుతూ సమాజంలోని స్త్రీలను హీనంగా చూస్తుందన్నారు. సమాజంలో కుల, మత అంతరాలు సమసి పోవడానికి జ్యోతిరావుపూలే, అంబేద్కర్ లాంటి మహనీయులు ప్రతిపాదించిన ఆదర్శ వివాహాలు మరిన్ని జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్, ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి పాషా, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందేమంగ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, ఐఎఫ్‌టియూ నాయకుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు కేటాయించాలని మంత్రులకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

లక్సెట్టిపేట: ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ బుధవారం జర్నలిస్టులు మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలాగా విధులు నిర్వహిస్తున్నారని వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని, ఇళ్ళ స్థలాలు కేటాయించాలని, డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

మంత్రిగారూ.. అనుమతులు ఇప్పించరూ..

- అటవీ అనుమతులు లేక ఆగిన రోడ్డు
- నేడు నెన్నెలకు రానున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



కంకర తేలిన కోణంపేట రోడ్డు

నెన్నెల: గ్రామాభివృద్ధికి రహదారులే కీలకం. దీనిని గుర్తించిన ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రోడ్ల నిర్మాణాల కోసం రూ.కోట్ల నిధులను మంజూరు చేసింది. అయితే అటవీ శాఖ అనుమతులు లేక పనులు నిలిచిపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. రోడ్డు సౌకర్యం లేక, బస్సులు రాక గ్రామీణులకు కష్టాలు తప్పడం లేదు. అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ కూడా వెళ్లలేక మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. వర్షాకాలంలో రోడ్డు లేక గ్రామీణులు పడరాని పాట్లు పడుతున్నారు. బీటీరోడ్లకు నిధులు మంజూరయ్యాయని ఆశపడిన పల్లెప్రజలకు నిరాశే మిగిలింది. అటవీ శాఖ అనుమతులు లభించక నెన్నెల మండలం మన్నెగూడం నుంచి కోణంపేట వరకు బీటీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. అనుమతుల కారణంగా బొప్పారం నుంచి దుగునపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడం, సింగిల్‌రోడ్డుకు ఇరువైపుల మొరం పోయాకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వేమనపల్లి మండలం నాగారం నుంచి వేమనపల్లి, లింగాలు నుంచి నాగారం వరకు అటవీ శాఖ అనుమతులు లేక రోడ్డు పనులు నిలిచిపోయాయి. గురువారం అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నెన్నెలలో తునికాకు కూలీలకు బోనస్ డబ్బులు పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో రోడ్లకు అటవీ అనుమతులు ఇప్పించి రవాణా సౌకర్యం కల్పించాలని నెన్నెల, వేమనపల్లి మండల ప్రజలు కోరుతున్నారు.

చెక్కులు పంపిణీ చేయనున్న మంత్రి

బెల్లంపల్లి నియోజకవర్గానికి 2016 నుంచి 2021 వరకు మంజూరైన రూ.10 కోట్ల 87 లక్షల తునికాకు బోనస్ చెక్కులను 17,623 మంది కూలీలకు అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి పంపిణీ చేయనున్నారు. ఏడేళ్ల తర్వాత ఒక్కో తునికాకు కూలీకి రూ.10 వేల నుంచి రూ.40 వేలకు పైగా బోనస్ డబ్బులు మంజూరు కావడంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గొల్లపల్లిలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించనున్నారు.

తొలిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



దండేపల్లి: పరీక్షకు హాజరైన విద్యార్థులు

బెల్లంపల్లి: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. బెల్లంపల్లిలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల , ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల, సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.
మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, అందుగుల పేటలోని సింగరేణి మహిళా కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఎస్సై చంద్రకుమార్ పర్యవేక్షణలో భద్రత ఏర్పాట్లు చేశారు.
జన్నారం: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో నిమిషం నిబంధన ప్రవేశపెట్టడంతో విద్యార్థులు పరీక్ష కోసం పరుగులు తీశారు. తొమ్మిది గంటల అయిదు నిమిషాల తరువాత పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థిని నందినిని కానిస్టేబుల్ ఆపడంతో కాసేపు బతిమిలాడింది. ప్రిన్సిపాల్ దృష్టికి వెళ్లడంతో పరీక్షకు అనుమతించారు. మరోసారి ఆలస్యం చేయవద్దని సూచించారు.
దండేపల్లి: దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు అరగంట ముందు విద్యార్థులను తనిఖీ చేసి లోనికి పంపించారు.

వేంపల్లిలో కంటివెలుగు శిబిరం ప్రారంభం



కంటి పరీక్ష చేసుకుంటున్న సర్పంచ్ శారద

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం సర్పంచ్ వోలపు శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శారద కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ డేగ బాపు, ఉప సర్పంచ్ బొడ్డు స్వరూప, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, వైద్యురాలు వైష్ణవి, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న స్వామి

బెల్లంపల్లిరూరల్: కిడ్నీ సంబంధిత వ్యాధితో ఇటీవల అకాల మరణం చెందిన కాంగ్రెస్ కార్యకర్త గోలేటి రాజు కుటుంబానికి బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు న్యాతరి స్వామి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి లక్ష్మణ్, శివ, సమత్ పాల్గొన్నారు.

పోచమ్మకు బోనాలు

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఇందిరానగర్‌లో గల పోచమ్మ ఆలయంలో బుధవారం భక్తులు బోనాలు సమర్పించారు. తల్లి దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని పూజించారు. వార్డు కౌన్సిలర్ కొక్కుల ప్రవంతి, సతీశ్, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

వైశ్యభవన్‌లో మహిళా దినోత్సవం



మహిళలను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో బుధవారం వాసవి, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 13 మంది మహిళలను ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో మంచిర్యాల డీఎస్‌వో సాగరిక, న్యాయవాది గట్టు కవిత, వాసవి క్లబ్ క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ నలుమాసు లావణ్య, వనితా క్లబ్ చార్టర్ అధ్యక్షురాలు సిద్దంశెట్టి మధుశ్రీ, నాగిశెట్టి జ్యోతి, చిలువేరు జ్యోతి, నరేందుల భవాని, గౌరిశెట్టి ధనలక్ష్మి, ఆర్పీ రేణిగుంట్ల స్వప్న ఉన్నారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వనితా క్లబ్ అధ్యక్షురాలు మోటూరి సరిత, కోశాధికారి బోనగిరి లావణ్య, కొండ చంద్రశేఖర్, ముక్తా శ్రీనివాస్, అక్కినపల్లి రవీందర్, అప్పాల శ్రీధర్, పుల్లూరి బాలమోహన్, కొెట్టి వంశీకృష్ణ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి తొలగిన అడ్డంకి



జిమ్మపత్రం అందిస్తున్న తహసీల్దార్

వేమనపల్లి: మండల కేంద్రంలో 33కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎట్టకేలకు అడ్డంకి తొలగింది. వేమనపల్లి శివారు సర్వే నం.6లో ఎకరం ప్రభుత్వ భూమిని ట్రాన్స్‌కో శాఖకు కేటాయిస్తున్నట్లు తహసీల్దార్ రాజ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్, సర్పంచ్ కుబిడె మధుకర్‌లకు బుధవారం జిమ్మ పత్రం అందజేశారు. గతంలో ఈ భూమిని సబ్‌స్టేషన్‌కు కేటాయించగా ఆక్రమణదారుడు భూమి తనదనని అడ్డంకిగా నిలిచాడు. దీంతో ఏడాదిగా సందిగ్ధత నెలకొంది. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్ విషయాన్ని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దృష్టికి తీసుకెళ్లగా స్థలాన్ని సబ్‌స్టేషన్‌కు కేటాయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో సర్పంచ్ సమక్షంలో తహసీల్దార్ ట్రాన్స్‌కో ఏఈకి జిమ్మపత్రం అందజేశారు. ట్రాన్స్‌కో సీఎండీ ద్వారా నిర్మాణానికి అనుమతులు తీసుకుని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఏడీ

చెన్నూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన సభలో మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ల సమక్షంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని మార్కెట్ కమిటీ ఏడీ గజానంద్ ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా మల్లెల దామోదర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా బైంసా ప్రభాకర్, డైరెక్టర్లుగా భూక్యా రాజ్‌కుమార్, రుద్రభట్ల సంతోశ్, ఖాజా కమురొద్దీన్, మద్ద మధుకర్, మానిక, రౌతు శంకర్, భీమ్ మధుకర్, గాదె శ్రీనివాస్, కంకణాల సంపత్‌రెడ్డి, మోర్ల లక్ష్మణ్, జులూరి మనోహర్, ఉమేశ్ చంద్ గిల్డా, మెండె హేమలత ప్రమాణస్వీకారం చేశారు.

పోచమ్మ, చల్లమల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపనలు



విగ్రహానికి పూజలు చేస్తున్న మహిళలు

కాసిపేట: సోమగూడెంలోని భరత్‌కాలనీలో పోచమ్మ , చల్లమల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభించారు. నేటి నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా బుధవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్టాపన, నవగ్రహ వాస్తు మండల, జలదివాసములు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో భక్తులతో ఊరేగింపు నిర్వహించారు. 16న దేవతా నిత్యపూజలు, అభిషేకం, పాలధివాసం, పుష్పదివాసం, మంగళహారతి, 17న విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీలగౌడ్, నాయకులు దూడం మహేష్, బైరగోని సిద్ధయ్య పాల్గొన్నారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: పట్టణంలోని సీసీసీ కార్నర్ వద్ద గల బీఆర్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గోషిక మనోజ్ కుమార్ మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విగ్రహానికి పెయింటింగ్ వేయించాలని, విద్యుత్ దీపాలతో అలంకరించాలని కోరినట్లు తెలిపాడు. ఈ కార్యక్రమంలో దాసరి వెంకట రమణ, సిరిమల్ల రత్నం, నందయ్య, పానుగంటి అరుణ్‌కుమార్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం నర్సరీని సందర్శించిన మంత్రులు



ఆయిల్‌పాం మొక్కలు పరిశీలిస్తున్న మంత్రులు

భీమారం: మండల కేంద్రానికి సమీపంలో పెంచుతున్న ఆయిల్‌పాం నర్సరీలోని మొక్కలను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ వంటనూనెల కొరత తీవ్రంగా ఉందని దీనిని నివారించేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున ఆయిల్‌పాం తోటలు పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చొరవతో చెన్నూర్ నియోజకవర్గంలో నర్సరీ ఏర్పాటు చేసి తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నర్సరీలో పెరుగుతున్న మొక్కల గురించి మంత్రి మాట్రిక్స్ కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

పార్కు ప్రారంభించిన మంత్రి

లింగంపల్లి గ్రామ సమీపంలోని జోడు వాగులు వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ అర్బన్ ఎకో పార్కును మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్‌తో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. చెన్నూర్ నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి అరెస్ట్

భీమారం: మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వాట్సాప్‌లో పోస్ట్ చేసిన కొక్కుల నరేశ్‌ను బుధవారం పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. మంత్రి హరీశ్‌రావు పర్యటన సందర్భంగా తాను వాట్సాప్‌లో పోస్ట్ చేస్తే తనను అన్యాయంగా అరెస్ట్ చేశారని యువకుడు వాపోయాడు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని పోస్ట్‌లు పెట్టడం తప్పా అని ప్రశ్నించారు.